## క్లుప్తంగా

### 600 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అగాడి వీధి నుంచి బెల్లంమండి వీధికి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యంను ఆదివారం ఎస్‌ఐ జయరాముడు తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. దండుకు చెందిన వెంకట సుబ్బమ్మ, తన దోసెల అంగడి కోసం ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తుండగా ఆటోను, 15 బస్తాలు (ఒక్కో బస్తాలో 40 కిలోలు) మొత్తం 600 కిలోలను పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

### పెండింగ్ వేతనాలను చెల్లించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని ఆశా కార్యకర్తలకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కెసీ బాదుల్లా, నాయకులు చంద్రశేఖర్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్ళు అయ్యవారమ్మ, శాంతమ్మ, అమ్ములు, లలిత, సంతోషి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

### యూటీఎఫ్ నిరంతర పోరాటం

కడప ఎడ్యుకేషన్: మున్సిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీడీఓ అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడంలో యూటీఎఫ్ పోరాటపటిమ, పీడీఎస్ ఎమ్మెల్సీ అకుంఠిత దీక్ష ఎంతో ఉందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అన్నారు. ఆదివారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖలోని మున్సిపల్ ఉపాధ్యాయులను తీసుకరావడంలోను, మున్సిపాల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీడీఓ అధికారాలు కల్పించడంలోనూ యూటీఎఫ్ నిరంతర పోరాటం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ దావుద్దీన్, ఆడిట్ కమిటి కన్వీనర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సివి రమణ, నాయకులు సుజిత్, జావీద్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బకాయిల చెల్లింపులో జాప్యమెందుకు

– ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

కడప ఎడ్యుకేషన్: సంవత్సర కాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి. రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యవసర కుటుంబ అవసరాల నిమిత్తం ఉద్యోగ, ఉపాధ్యాయులు పొదుపు చేసుకున్న సొమ్ము కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నీ త్వరగా చెల్లించాలన్నారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, నాయకులు సుబ్రమణ్యంరాజు, బాలగంగిరెడ్డి, ఇలియాస్‌బాష, ఆదినారాయణరెడ్డి, సంగమేశ్వరెడ్డి, బాలరాజు, ఏపీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఏఐటియుసీ నాయకులు నాగసుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు సురేష్‌బాబు, రమణయ్య, జయరామయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ వృద్ధులను ఆదుకునేందుకు ముందుకు రావాలని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె తన కుమార్తెతో కలిసి నగర శివార్లలోని బృంద వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులను దైవ సమానులుగా భావించాలన్నారు. తమ సంపాదనలో కొంతమొత్తాన్ని ఇలాంటి వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వారికి కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్సన్, వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు బాలసుబ్బయ్య, సుధారాణి పాల్గొన్నారు.

– కడప నగరంలోని పలు కూడళ్లలో ఉంటున్న పేదలు, యాచకులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించామని నీరజ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు వజ్రధర్, అరుణ్, హరనాథ్, సుమంత్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు, కోటిరెడ్డిసర్కిల్, వైవీ స్ట్రీట్, ఏడురోడ్ల కూడలి, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ఉండే అనాథలకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశామన్నారు.

# శిల్పారామంలో చిన్నారుల సందడి

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక ఎస్ఎస్ఎల్ డ్యాన్స్ అకాడమి చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. సామాజిక అంశాలపై పలు కామెడి స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.





# చిత్రకారులకు సంక్షేమ బోర్డు కావాలి

కడప కల్చరల్/ కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో స్వశక్తిపై ఆధారపడి జీవిస్తున్న చిత్రకారుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ స్మారక ప్రెస్‌క్లబ్‌లో జిల్లా చిత్రకారుల సంక్షేమ సంఘం వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిత్రకళాకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఈ పనులను పెద్ద పెద్ద కంపెనీలకు మాత్రమే ఇస్తున్నారని, స్థానిక కళాకారులకు ఈ పని అప్పజెబితే వారి కుటుంబాలకు మేలు జరుగుతుందని సూచించారు. జిల్లాలో వందలాది మంది చిత్రకారులు బొమ్మలు గీస్తూ, అందమైన అక్షరాలు రాస్తూ జీవనం గడుపుతున్నారని, వారి ఆర్థిక స్థితిగతులు దయనీయంగా ఉన్నాయన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం చేయూతనివ్వాలని కోరారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు చిత్రకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కార్మికశాఖ నుంచి గుర్తింపు కార్డులు ఇప్పించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు ఉందని, అలాగే తమకు కూడా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న డ్రాయింగ్, క్రాఫ్ట్ ఉద్యోగాలలో అర్హత గల చిత్రకారులను నియమించాలని కోరారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షులు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చిత్రకారులంతా ఐక్యంగా నిలిచి సమస్యలపై పోరాడాలని, సాధించాల్సిన సంక్షేమ బోర్డు కోసం అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేవీ రవి, రాష్ట్ర నాయకులు అన్వర్, అనిల్, మున్నా, హుసేన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామనూరు శ్రీనివాసుల రెడ్డి

### పాలిసెట్-2023కి ఉచిత శిక్షణ

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023 పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులంతా 2023 పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఏప్రిల్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తమ కళాశాలలోనే గతంలో ఎన్నడూలేని విధంగా ఏప్రిల్ 16వ తేదీ నుంచి అత్యుత్తమ, అసాధారణ ఫ్యాకల్టీతో పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. మే 10న పాలిసెట్ ఉంటుందన్నారు. దరఖాస్తు, కోర్సులు, సీట్ల వివరాలు తెలుసుకోవడానికి తమ కళాశాలలోనే హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. తమ కళాశాలలో డీఈసీఈలో 66 సీట్లు, డీఈఈఈలో 66 సీట్లు ఉన్నాయన్నారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీలు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. పాలిటెక్నిక్ ద్వార నైపుణ్య సామర్థ్యాలు మెరుగుపడి విద్యార్థులందరికి పరిశ్రమల్లో త్వరగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పూర్తి వివరాలకు తమ కళాశాలలో సంప్రదించాలని ఆయన అన్నారు.

### గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయముల సంస్థ తాడేపల్లి ఆధ్వర్యంలో కమలాపురం గురుకుల పాఠశాల నందు 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్(ఇంగ్లీష్ మీడియం) ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ తులశమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో విద్యార్థినులను ప్రవేశ పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను మార్చి 24వ తేదీలోపు నెట్ సెంటర్ ద్వారా గాని, సమీపంలోని గురుకుల పాఠశాలల నుంచి గాని ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 5వ తరగతి విద్యార్థినులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థినులకు అదే రోజు మధ్యాహ్నం 2గం. నుంచి 4.30 గంటల వరకు ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె అందులో తెలిపారు.

### ఆత్మరక్షణ విద్య అందరికీ అవసరమే

కడప కార్పొరేషన్: ప్రస్తుత సమాజంలో ఆత్మ రక్షణ విద్యలు బాలబాలికలకు అవసరమని 50వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కె. రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయిపేట హైస్కూల్‌లో కరాటే నందు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను వారు అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాము నేర్చుకున్న విద్యలో నైపుణ్యత సాధించాలని, తద్వారా తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 37వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బసవరాజు, కరాటే మాస్టర్ ఉదయ్ కుమార్, విజయలక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

### పేదలకు ఉచితంగా 40 బస్తాల వరిధాన్యం



వరిధాన్యాన్ని సంచుల్లో నింపుతున్న లక్ష్మిరెడ్డి, నితీస్‌కుమార్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: లేవాకు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ లేవాకు లక్ష్మిరెడ్డి తమ పొలంలో పండిన వరిధాన్యాన్ని రామరాజుపల్లె, పబ్బాపురం, రామచంద్రాపురానికి చెందిన 40 మంది పేదలకు 40 బస్తాల వరిధాన్యాన్ని ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. లేవాకు లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా తమ పొలంలో పండిన వరిధాన్యాన్ని ప్రతి ఏటా పేద వర్గాలకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో లేవాకు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి, బాలాజీ ఎంబీఏ కళాశాల చైర్మన్ లేవాకు నితిష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఇరుగులమ్మలకు విశేష పూజలు



సిద్దవటం : మండలంలోని సిద్దవటం గ్రామ శివారులోని ఇరుగులమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ఆకుపూజ, కుంకుమార్చన, సహస్రనామార్చన, వంటి పూజా కార్యక్రమాలు చేశారు. కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించగా, మరికొందరు భక్తులు అమ్మవారికి కాయాకార్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అమ్మవారి గుడికి వచ్చిన భక్తులకు మూలపల్లె గ్రామానికి చెందిన అల్లూరు మస్తాన్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

# నాదర్ షా వలీ దర్గా ఉరుసులో డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని 32వ డివిజన్ ఎంఆర్ వీధిలో వెలసిన హజరత్ నాదర్ షా వలీ దర్గా ఉరుసు మహోత్సవంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూల చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్ బాషా, చాంద్‌బాషా, ఉమైర్, కార్పొరేటర్లు జఫ్రుల్లా, షంషీర్, పార్టీ నాయకులు చాక్లెట్ గౌస్, మాస్టర్ అహ్మద్, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నదీర్ షా వలీ దర్గాలో పూల చాదర్ సమర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

# ఆర్య క్షత్రియులు సంఘటితంగా ఉండాలి

– డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ఆర్య క్షత్రియులు సంఘటితంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా సూచించారు. ఆదివారం స్థానిక బ్రాహ్మణ వీధిలోని రాఘవేంద్రస్వామి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆర్య క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్య క్షత్రియుల సంఘం తమ వర్గానికి చెందిన ప్రజల సంక్షేమంతోపాటు సమాజ సేవకు తోడ్పాటునివ్వడం అభినందనీయమన్నారు.

ఈ సంఘం ఆధ్వర్యంలో అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించాలని భావించడం సంతోషదాయకమన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అజ్మతుల్లా, షఫీ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బి. లింగమూర్తి, ఆర్య క్షత్రియ సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

# ఘనంగా గంగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరులో గంగమ్మతల్లి ఆలయ 30వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, సర్పంచ్ వెంకటరామిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి కానుకల రూపంలో వచ్చిన పట్టు వస్త్రాలకు ఆలయ నిర్వాహకులు వేలంపాట నిర్వహించగా రూ.20 వేల ఆదాయం వచ్చిందన్నారు. వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

**బండలాగుడు పోటీలు**

బండలాగుడు పోటీలను ఉదయం 7 గంటలకు రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డిలు ప్రారంభించారు. కాదర్‌ఖాన్ కొట్టాల్ కడప రూరల్‌కు చెందిన పవన్‌కుమార్ ఎద్దులు మొదటి స్థానం సాధించగా చిన్ననాగిరెడ్డిపల్లెకు చెందిన శంకర్‌రెడ్డి ఎద్దులు రెండవ స్థానం, యల్లనూరు మండలం చిలంకూరుకు చెందిన పుట్లూరు సుదర్శన్ ఎద్దులు మూడవ స్థానం, ప్రొద్దుటూరు మండలం నాగాయపల్లెకు చెందిన మూలె నారాయణరెడ్డి ఎద్దులు నాలుగవ స్థానం సాధించాయి.



అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న భక్తులు

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేశారు. 1976–79 బ్యాచ్‌కు చెందిన బీకాం విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న ఈ సమావేశంలో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు పరిచయం చేసుకుని, ఏమి చేస్తున్నారో, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారు చదువుకున్న సమయంలో తరగతి గదిలోని జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మునిశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వీరయ్య, న్యాయవాదులు కాకర్ల నాగశేషారెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, పల్లవోలు రామమోహన్ రెడ్డి, రిటైర్డు అధ్యాపకులు దస్తగిరిరెడ్డి, లక్ష్మీరెడ్డి, నాగిరెడ్డి, నాయక్, శ్రీధర్, డిప్యూటీ ప్రిన్సిపాల్ బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవారికి పూజలు

లక్కిరెడ్డిపల్లి : అశేష భక్తజన తాకిడితో ఆదివారం మరోమారు గంగమ్మ ఆలయం జాతరను తలపించింది. జాతర ముగిసిన మొదటి ఆదివారం కావడంతో చుట్టు పక్కల ప్రాంతాల వారితోపాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న భక్తులకు లక్కిరెడ్డిపల్లె ఎస్‌ఐ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ రవీంద్రరాజు, సర్పంచ్ వెంకటనారాయణరెడ్డిలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో శీతలపానీయాల దుకాణాలు, మిఠాయి దుకాణాలు, బొమ్మల కొలువులు, చెరుకుల బండ్లు అధిక సంఖ్యలో రావడంతో వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. ఆలయ పూజారులైన ఆదిమూలం చంద్రశేఖర్, వేమయ్య, గంగయ్య, రెడ్డిశేఖర్, బోస్‌లు భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

**ఘనంగా జరిగిన గంగమ్మ జాతర**

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లె–కొత్తపేట సరిహద్దులోని గంగమ్మ ఆలయం ఆదివారం జనసంద్రంగా మారింది. జాతర ముగిసిన తర్వాత వచ్చే నాలుగు వారాల్లో భాగంగా మొదటి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అలాగే ఆలయ ఆవరణలోని వీరభద్రస్వామి, సాయిబాబా, ఆంజనేయస్వాములను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం బంధు మిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ బి.అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.




లక్కిరెడ్డిపల్లి: ప్రత్యేక అలంకరణలో అనంతపురం గంగమ్మ



చింతకొమ్మదిన్నె : ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

### పనిచేయని లిఫ్ట్‌తో ప్రయాణికుల ఇబ్బందులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్‌లోని ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన లిఫ్ట్ పనిచేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు, మూడు రోజులుగా లిఫ్ట్ పనిచేయకపోవడంతో ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు, గర్భవతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. హైదరాబాదు, ముంబయి వైపు వెళ్లే రైళ్లు మూడవ ప్లాట్‌ఫామ్‌పైకి వస్తుంటాయి. దీంతో ఆయా ప్రయాణీకులు మూడవ ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్లాల్సి వస్తుంది. అలాగే కడప నుంచి ప్రతిరోజు వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్ బయలుదేరేముందు ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంకి సుమారు గంట పైగా నిలుపుతుండడంతో ఆ సమయంలో చెన్నై, తిరుపతికి వెళ్లే రైళ్లన్నీ రెండవ ప్లాట్‌ఫాం పైకి వస్తుంటాయి. ఈ ప్రయాణీకులు కూడా లిఫ్ట్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కడప రైల్వేస్టేషన్ అధికారులు సత్వరమే స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పనిచేయని లిఫ్ట్

# నృత్య ప్రదర్శన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోడంపల్లెలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులు విశేషంగా దర్శించుకుంటున్నారు. సాయంత్రం నవదుర్గ వేషధారణలో చిన్నారులు అందరిని ఆకట్టుకున్నారు. నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. మోక్షగుండం వీధి ఓంశాంతి భవన్ ఇన్‌చార్జి పావని బెహన్‌జీ ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రాముఖ్యతను వివరించారు.



నవదుర్గ వేషధారణలో చిన్నారులు



నృత్య ప్రదర్శనలో విద్యార్థులు